# విరుద్ధ మనస్తత్వం

రామం నన్ను దూరాన్నించే చూసి 'విష్' చేశాడు.

'అప్పుడే మిత్రబృందం అంతా వచ్చినట్టుందే' అనుకుంటూ, వాళ్ళ దగ్గరిగా వచ్చి, సైకిలుదిగి, వాళ్ళ మధ్యగా పచ్చగడ్డి మీద కూచున్నాను.

కాలికింద పచ్చగడ్డి మెత్తగా తగిలింది. చల్లటిగాలి హాయిగా సోకింది.

దూరాన్న పంటకాలవలో సాయం సంధ్య వెలుగు ప్రతిఫలిస్తోంది. పేరు తెలీని తెల్లటి పక్షులగుంపు, ఆకాశంలో అంతులేని ప్రయాణం చేస్తున్నట్టుగా, రెక్కలు బారుగా చాచి, ఒక క్రమంలో పోతున్నాయి.

మిత్రులంతా తీవ్ర చర్చలో వున్నారు. వాళ్ళు మాట్లాడే విషయం గూడా తెలీడం లేదు. ఒకడిమాట పూర్తిగాకుండా మరోడు అందుకుంటున్నాడు.

ఒక్క జనార్దనం మాత్రం సంధ్యకేసి చూస్తూ కూచున్నాడు. చూపు తిప్పడం లేదు.

పశ్చిమాకాశం చిక్కటి ఎరుపు రంగు పులుముకొంటోంది.

ఉన్నట్టుండి "ప్రియురాలి కందిన వదనంలా ఉందీ సాయంకాలపుటాకాశం. ఏ దృక్పథంనుండి చూసినా నాకు ఈ అరుణాకాశంనుండి తెలుసుకోదగిందీ, గ్రహింపగల్గిందీ అంతకంటే ఏం లేదనిపిస్తోంది. ఏం? నేనిలాగే వర్ణిస్తా నా కథల్లో. నా కంటికేదెలా కనబడితే అలాగే వ్యక్తపరుస్తా," అన్నాడు జనార్దనం, అందరికేసీ తిరిగి.

అతను ఈ రోజున ఇంత నిక్కచ్చిగా నలుగురిలోనూ ఈ సంగతి చెప్పనవసరం లేదు. ఈమధ్య జనార్దనం రాస్తూన్న కథలన్నిటిలోనూ ఇదె వరస.

తక్కిన మిత్రులంతా జనార్దనానికి సమాధానం చెప్పక ఊరుకున్నారు.

కాని నాకు కొద్దిగా కథలు రాయడం, కాస్త సభ్యతకు లోటు లేకుండా గ్రంథపరిజ్ఞానం ఉండటంచేత, ఆ ఆసరా చూసుకొని, ఈ వేళ అతగాణ్ణి సంభాషణలోకి లాగి, ఓపూపు పూపుదామనుకున్నాను.

"ఇప్పుడు మీరన్నదాంట్లో అర్థం చాలా అల్పంగా వున్నట్టు తోస్తోంది," అన్నాను.

అప్పుడే కాల్చి పారేసిన సిగరెట్టు తాలూకు పొగ తిరుగుతూన్న మెలికలు చూస్తూ "అలా రండి...ఆ పక్కగా వెళ్దాం, నేనన్నదాంట్లో అర్థం అల్పం కాదనీ—ఈ అనంత విశ్వంలోని పరమార్థమేనన్న నగ్నసత్యాన్ని మీ చేతే అనిపిస్తాను" అన్నాడు జనార్దనం.

నేను ఈ 'ఛాన్సు' వదిలదలుచుకోలేదు. అతన్ని వాదనలో చిత్తు చేద్దామన్న ఆశ మనసుకు పట్టుకుపోయింది. మిత్రులందరిలోనూ అతన్ని ఓడించి, గెలుపు సాధిద్దామన్న ఆశ మరీ ప్రోత్సాహమిచ్చింది.

కాని అప్పుడే జనార్దనం లేచి, నాకేసి రమ్మన్నట్టు చూస్తూ, ముందు కదుగేశాడు. అయిష్టంగానే లేచి అతన్ని అనుసరించాను—మిత్రు లందరి మధ్యా అతన్ని ఓడించాలన్న ఊహను పక్కకి నెట్టేసి.

ఇద్దరం దూరంగా నిర్జనంగా వున్న ప్రదేశానికి పోయాం.

"అంటే మీరంటూన్న వేదాంతానికి

## భమిడిపాటి జగన్నాథరావు

మూలం 'రియలిజమా?'" అన్నాను. వెటకారం ధ్వనిస్తూ, సరిగ్గా ఆ 'రియలిజమ్' అన్న పదానికి అర్థం తెలీకపోయినా, అలాటి పెద్ద మాటలుపయోగించి గెలుపు సాధిద్దామని మొదటే నిర్ణయించుకొన్నానుగా మరీ—

"మీరు నా వాదానికి, ఏపేరూ పెట్టకండి...పేర్లతో నిమిత్తంలేదు," అన్నాడాయన కొంచెం సీరియస్‌గా.

నేనేదో కులాసాగా మాట్లాడుతూ వాదిద్దామనుకుంటే, ఈ మూలకి తీసుకొచ్చి, ఈ సీరియస్‌నెస్ ఎందుకీయనకీ అని నాకప్పుడే తట్టింది.

మా ఇద్దరిమధ్యా ఆవరించిన నిశ్శబ్దం నన్ను విశేషంగా బాధిస్తోంది.

ఈయన ఏదో చెపుతానని తీసుకొచ్చిన విషయం మర్చిపోలేదు గదా!

"మీరుకూడా కథలు రాస్తారుకదూ?" హఠాత్తుగా అడిగేడాయన.

'ఇదేమిరా! కథ అడ్డు తిరిగింది!' అనుకున్నాను.

ఏదో తన ఉద్దేశాలు వెలకబోస్తానని తీసుకొచ్చి నాకు సంబంధించిన విషయాల మీద యీ నిక్కచ్చి ఏమిటీ?

"ఆ! ఏదో! అప్పుడప్పుడులెండి" అన్నాను ఓ చిరునవ్వు విసిరి.

ఆయన మొదలెట్టాడు:

"మీరు కథలురాస్తూ వాటికి మీ పేరు పెట్టకుండా, ఏమిటో 'ఏకాకి' అనే పేరుతో రాస్తారెందుకు? ఎవరో కొందరు తగినవాళ్ళు కారణాంతరాలచేత 'పెన్‌నేమ్' పెట్టుకుంటే వారినిచూసి మీగ్గూడా ఎందుకండి యీ మారుపేరు? పైగా బాధగా, 'ఏకాకి' ఏమిటీ?...నిక్షేపంగా ఇద్దరు పిల్లలూ, చక్కటి గులాబీలాటి భార్య వుండగా, ఈ అజ్ఞాతవాసంలోని ఆనంద మేమిటీ?— నేనిలా అడగడం మొదలెడితే మీకెంతవెర్రిగా తోస్తుందీ? నాకు అర్థంగాని ఆనందమేదో మీరు అనుభవిస్తున్నందువల్లేగా మీరా పేరులో రాస్తూంట? మీరు చూసిన కోణంనించి నేను చూడలేకపోడంచేత నేకదా ఈ చిక్కంతా? సరే, ఆ సంగతలావుంచండి.

మీరు మొన్నో కథలో ఇలా రాసినట్టు జ్ఞాపకం. 'ఈమధ్య బయలుదేరిన కుర్రకారు కాస్తనిండుగా రంగుపూలెట్టుకుని వెళ్తున్న ప్రతిస్త్రీనికూడా వీధిమలుపు చివరదాకా చూస్తారని. జ్ఞాపకముందా అలా రాసినట్టు?

"ఊఁ..." అనిమాత్రం అనగలిగాను.

"అవునండీ. ఏం? చూస్తేఏం? ఆ చూపులు ఆమె శీలాన్ని గాని, మీ గౌరవాన్ని గాని,



ఆంధ్రప్రదేశ్ ఏజంట్లు
మెసర్సు సీతారామ్‌జనరల్ స్టోర్సు ఏజెన్సీస్
విజయవాడ, సికిందరాబాదు.

# ★ విరుద్ధ మనస్తత్వం ★

సంఘనీతిని గాని అపహరించాయా? ఇలా అన్నానని, ప్రతివ్యక్తీ కనబడ్డ ఆడదాన్నల్లా ఎగాదిగా చూడ్డం భావ్యమేనా అంటారు మీరు—దానికి సమాధానం చెప్తున్నా చెప్పమంటారా?"

"అలాగే" అన్నాను తెల్లబోయి. అసలు ఎదురుప్రశ్నలు వేయడానికి గుండెలు లేవుగా...పావుగంట క్రితమే జారిపోయినట్టున్నాయి. మనసులో కూర్చిపెట్టుకున్న మాటలొక్కటీ సమయానికి దొరకడంలేదు. ఖర్మ!

ఆయన మళ్లా మొదలెట్టాడు:

"ఓ అమ్మాయి...మాంచి అందమైన పిల్లే అనుకోండి, ఓ మంచిచీర కట్టుకుని వీథులో నడుస్తూ వుంటుంది. ఎవరైనా పరాయివాళ్ళు చూస్తున్నారని తెలీగానే, అదోరకం ముఖభావం నటిస్తూంది. ఆ అమ్మాయి కూడా అందరూ తనను చూసి, తన సొబగు వీక్షించాలని ఇష్టపడుతూందేమోనని మీరెప్పుడైనా ఆలోచించారా? ఆ అమ్మాయి మనస్తత్వం అన్ని పేపర్లలోనూ ఫస్టుమార్కులొచ్చిన విద్యార్థిలా వుంటుంది. ఇద్దరి మార్గాలు వేరు...గమ్యస్థానాలొకటైనా, ఇద్దరి ఆశ ఒకటే ...తమగొప్ప అందరూ గుర్తించాలని.

"లేకపోతే ఆపిల్ల అంత మంచిచీర కట్టుకుని, అంతఅందంగా నలుగురిలోకీ వస్తుందా? కాని సిగ్గు నేపరదా ఎప్పుడూ ఆవరించుకునే వుంటుంది. ఆ పరదాయే లేకపోతే పురుషునిలో అవ్యక్త మధురస్మృతులు లేవీ మొలకెత్తవేమో! అందుచేతే తోటిఆడవాళ్ళు ఆచీర బాగావచ్చిందంటే ముసిముసి నవ్వుల్తో విని ఆనందిస్తుంది. పురుషుని సంగతెత్తేటప్పటికి సిగ్గుతెర సంతోషాన్ని వ్యక్తపరచనీదు.

"శాస్త్రరసజ్ఞుడైన ప్రతిమానవుడూ సౌందర్యోపాసనకు పాకులాడతాడు. కాని కొంతమందిమాత్రం—బుద్ధి వక్రించి, శ్రుతిమించి: లాలసతో సౌందర్యాన్ని ఆనందించలేక హద్దులు దాటుతారు.

"ఇంకోవిషయం బజారులో అందమైన చీరల్నీ వస్తువుల్నీ బీరువాల్లోంచి చూసి ఆనందించగా లేంది...అమ్మాయి వొంటిమీద చూసి ఆనందిస్తేయేం? బీరువాల్లోంచి చూసినంత నిర్మలంగానే ఈ విషయాన్ని తీసుకోరాదూ?

"పైగా ఆ అమ్మాయి ఆచీరకుతోడు జుట్టు మనోహరంగా మలిచి చివర వదిలేస్తుంది. చీర చాలా అల్లరిగా కదులుతుంది... దానికితోడు జడనిండా ఓగుప్పెడు జాజిపూలు తురుముతుంది. దీనికి కారణం ఏమిటీ? ఏం? ఆ అమ్మాయి ఆపూలు పెట్టుకోకపోతే అమ్మేవాడికి నష్టమనా? లేక ఆపూల సువాసన రాణించదనా? ఏదీకాదు.

"అందమైన వస్తువుని చూచి పరవశమై ఆనందించాలనే ఆశ పురుషుడికీ ఆ అందమైన వస్తువును తనలో ఇముడ్చుకోవాలనే ఆశ స్త్రీకి ఉండడం సహజం. అంతేగాని, మీరు రాసినట్టుగా పురుషులంటే ప్రతీ ఆడదాన్నీ చూడనూ చూడరు ... చూసినా — కారణంమాత్రం ఆమె తల్లోవాడిన పూలూ రంగుపూలూ మాత్రం కాదు.

"మీరు మొదట నేనన్నదాంట్లో అర్థం లేదన్నదానికి కొంచెం డొంకతిరుగుడుగా ఇదే జవాబు"

జనార్దనం ఉపన్యాసం ఆపుచేశాడు.

"ఇదేం వేదాంతమయ్యా?" అనిపించింది నాకు. పోనీ ఎదురు చెబుదామంటే తెలుగు భాషలో తెలిసినమాటలు కరువై పోయినట్టు, నాకు మాటరాదేం!

"రండిపోదాం" అని అతనే తట్టిలేపాడు. మధ్యదారిలో అతనే ఇంత కాఫీపట్టించిన తర్వాత ఎవరిదారిన వాళ్ళు పోయాం.

ఇంటికొచ్చిన తర్వాత తట్టింది—అతను అందరిమధ్యా చేసిన వ్యాఖ్యానానికీ, నాకిచ్చిన ఉపన్యాసానికీ సంబంధంలేదని ఈసంగతి రేపుసాయంత్రం అడగాలనుకున్నాను...కాని నలుగురిలోనూ కాదని అప్పుడే నిర్ణయించుకున్నాను.

రెండోరోజున అతనురాలేదు. ఆతర్వాత నా స్వంతపనులవల్ల నేను వెళ్ళలేదు. మొత్తానికి ఓపది పదిహేనురోజులు అతన్ని కలుసుకోడం పడలేదు. ఆతర్వాత అతను ఆవూరినుండి బదిలీఅయి వెళ్లిపోయినట్టు తెలిసింది.

* * *

...మళ్ళా పదేళ్ళతర్వాతమాట.

జనార్దనం రాసిన ఉత్తరం అతన్ని జ్ఞప్తికి తెచ్చింది.

"రావుగారూ,

మీకు ఇదేనా మొదటి ఉత్తరం... బహుశా ఆఖరిదేమో కూడా!

ఇప్పుడు ఎఱ్ఱటి ఆకాశం వుత్తఎఱ్ఱగానే వుంది ... ప్రియురాలి కందిన వదనంలా లేదు..."

అంటూ ఏవేవిటో రాశాడు జనార్దనం.

'To every action there is always an equal and opposite reaction' అని పక్కింటి వారబ్బాయి చదువుతున్నాడు, బట్టీపట్టే ధోరణిలో. ★

